క్లుప్తంగా

ప్రగళ్లపల్లి లిఫ్ట్ నుంచి నీరు విడుదల

దుమ్ముగూడెం: మండలంలోని ఎస్ కొత్తగూడెం గ్రామంలోని ప్రగళ్లపల్లి లిఫ్ట్ నుంచి కాలువలకు నీటిని సోమవారం లిఫ్ట్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్ వ్యవసాయానికి రైతులు సన్నద్ధం అవుతుండటంతో రైతులు నార్లు పోసేందుకు, పొలం పనులు చేపట్టేందుకు అనువుగా నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో వర్మరాజు, కొమ్ము రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ..

మణుగూరురూరల్: అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏరియా జీఎం కార్యాలయ ప్రాంగణంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు జె.సాంబశివరావు.. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. అనంతరం డీజీఎం(పర్సనల్) మాట్లాడుతూ.. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిళ్ల నుండి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు కె.వెంకట్రావు, అనురాధ, సీతారాంబాబు, నాగరమేష్, బీవీవీఎస్ పాత్రుడు, సింగు శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, సాయిల సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా కూల్చడం దారుణం

అశ్వారావుపేటరూరల్: దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన నివాసాలను కనీసం నోటీసులు ఇవ్వకుండా స్థానిక అటవీ, పోలీస్ శాఖ అధికారులు కూల్చివేయడం తగదని మాదిగ హక్కుల దండోరా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరిపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక రింగ్ సెంటర్‌లోని సర్వే నంబర్ 1167లో హక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్న దుకాణాలు, నివాస గృహాలను సంబంధిత బాధితులకు కనీస సమాచారం, ముందస్తు నోటీసులు జారీ చేయకుండా జేసీబీలతో నేలమట్టం చేయడం తగదన్నారు. నష్ట పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీ వెంకన్న, హరిష్ శంకర్, కుక్కుమూడు సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రూపుల్లో అవకాశం కల్పించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలోని అన్ని గ్రూపుల్లో గిరిజన విద్యార్థులకు అవకాశం కల్పించాలని గోండ్వానా సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని గిరిజన గురుకుల కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాటిబోయిన శ్రీను, వెంకటేశ్వర్లు, సోడి దుర్గ భవాని, వర్షా మేఘన, తాటి శృతి కీర్తన, వగ్గేల త్రివేణి పాల్గొన్నారు.

మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దు

గుండాల: ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టుల నేపథ్యంలో నష్టపోయిన మావోయిస్టు దళ సభ్యులు ఆదివాసీ ప్రాంతాల్లో తలదాసుకుంటున్నారని అలాంటి వారికి ఆశ్రయం కల్పించొద్దని ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్ అన్నారు. ఆళ్లపల్లి మండలంలోని బూసురాయి ఆదివాసీ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానస్పద వ్యక్తులు కనబడితే తమకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టులకు సహరిస్తే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మిక శాఖలోనే ఉంచాలి

అశ్వాపురం: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేటీకరణ చేయకుండా కార్మిక శాఖ నిర్వహణలోనే ఉంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా లేబర్ కమిషనర్ ఎండీ.షర్ఫియుద్దీన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం నేడు పలు రకాల సమస్యలు చూపి ప్రైవేటీకరణ చేసేందుకు ఈ నెల 4న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, నాయకులు ధరావత్ గోపీనాయక్, పున్నయ్య, శంకరాచారి పాల్గొన్నారు.

బ్యాగ్‌ల వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని భీమవరం ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు బైరెడ్డి సాయిబాబు కుమారుడు బైరెడ్డి సాయి రాహుల్ జ్ఞాపకార్థం స్కూల్‌బ్యాగ్స్, అపక వెంకటేశ్వర్లు కుమారుడు అపక ఈశ్వర్ జ్ఞాపకార్థం వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అపక బాలరాజు వారికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతమ్మ, మచ్చ రమేష్, మచ్చ నర్సమ్మ, సోయం వెంకటేశ్వర్లు, మడకం సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై నజర్

- రుచి, శుచికి పెద్దపీట
- ఆ దిశగా వంట కార్మికులు, స్వచ్ఛ మిత్రలకు శిక్షణ
- విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి
- సానుకూల ఫలితాలపై ఆసక్తి



శిక్షణలో పరిశుభ్రతకు ఉపయోగించే సాధనాలను వివరిస్తున్న రిసోర్స్ పర్సన్

కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను మెరుగుపరచడం, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా, మండల స్థాయిలో కార్మికులకు, స్వచ్ఛ మిత్రలకు ఇటీవల శిక్షణ కార్యక్రమాలు కోర్స్ డైరెక్టర్, రిసోర్స్ పర్సన్స్ అధ్వార్యాన పూర్తయ్యాయి. ఈ చర్యలతో విద్యార్థులు ఆరోగ్యంగా, సురక్షితంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించే అవకాశం ఉంది.

నాణ్యమైన ఆహారమే లక్ష్యం

రుచికరమైన ఆహారం విద్యార్థులను ఆకర్షించి హాజరు శాతాన్ని పెంచుతుంది. ఈ నేపథ్యంలో వంట కార్మికులకు శిక్షణలో కూరగాయలను శుభ్రం చేయడం, పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయడం, రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారం తయారు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భోజన తయారీకి ఉపయోగించే కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు తాజాగా, నాణ్యమైనవి మాత్రమే ఉండేలా చూసుకోవాలని నేర్పించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా లేదా అనేదానిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని శిక్షణలో హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ

ఆహార నాణ్యతతో పాటు పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం కూడా విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. ఈ అంశంపై కూడా కార్మికులతో పాటు పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేసే స్వచ్ఛ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు మొదలైన వాటిని ఎలా శుభ్రంగా ఉంచుకోవాలనే దానిపై వారికి దిశానిర్దేశం చేశారు. అధికారులు పాఠశాలలను తరచుగా సందర్శించి పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేస్తారని వారికి స్పష్టం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై సమగ్ర కార్యాచరణ

వంట నాణ్యత, పరిశుభ్రతతో పాటు, విద్యార్థుల ఆరోగ్యాన్ని సమగ్రంగా మెరుగుపరచడానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. తద్వారా ఏమైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి, చికిత్స అందించడానికి కృషి చేస్తున్నారు. పాఠ్య ప్రణాళికలో భాగంగా ఆరోగ్య విద్యను చేర్చడం ద్వారా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి తెలుసుకునేలా చేస్తున్నారు. విద్యార్థులకు తక్షణ వైద్య సేవలు అందించడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ.. సమీక్షలు నిర్వహిస్తున్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: మండలపరిధిలోని కూనవరం పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా.. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పినపాక నియోజకవర్గానికి ఇప్పటికే 3500 ఇళ్లు మంజూరు అవ్వగా, అదనంగా మరో వెయ్యి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. మణుగూరు పట్టణంలో ఆదర్శనగర్‌లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న మొట్ల వాగు పూడికతీత పనులు ఆయన ప్రారంభించారు. 1.60కోట్లతో పనులు వారం రోజుల్లోగా పూర్తిచేయాలని, మణుగూరు ముంపునకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. కోడిపుంజుల వాగు, కట్టువాగు, మొట్ల వాగు పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన శరవేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, మండలంలోని ప్రజాభవన్‌లో 26 మంది లబ్ధిదారులకు రూ.9,60,000 విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అధికారులు తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరరావు, రమేశ్, సక్కు, మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, మండల నాయకులు నవీన్, శివసైదులు, బాబు, నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులకు నూతన నంబర్లు

అశ్వారావుపేటరూరల్: సబ్ డివిజన్ పరిధిలోగల అశ్వారావుపేట మండలంలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది, సబ్ స్టేషన్ల ఆపరేటర్ల ఫోన్ నంబర్లు మారినట్లు అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట రత్నం తెలిపారు.

ఈ మేరకు మారిన కొత్త నంబర్ల వివరాలను ఆయన వెల్లడించారు. అశ్వారావుపేట ఏడీఈ 87124 85983, ఏఈ(ఆపరేషన్) 87124 85984, లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 85985, లైన్‌మెన్ 87124 85986, అచ్యుతాపురం(లైన్ మెన్) 87124 85987, అశ్వారావుపేట సబ్ స్టేషన్ 87124 85988, నారంవారిగూడెం సబ్ స్టేషన్ 87124 85989, గంగారం సబ్‌స్టేషన్ 87124 85990, వినాయకపురం ఏఈఈ(ఆపరేషన్) 87124 85991, లైన్ ఇన్‌స్పెక్టర్ 87124 85992, అనంతారం(లైన్ ఇన్‌స్పెక్టర్) 87124 85993, వినాయకపురం సబ్ స్టేషన్ 87124 85994, నారాయణపురం సబ్ స్టేషన్ 87124 85995 నంబర్లు కేటాయించినట్లు వివరించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇతర సేవల కోసం కొత్త నంబర్లను సంప్రదించాలని ఏడీఈ కోరారు.

చర్ల: విద్యుత్‌శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి కొత్త ఫోన్ నంబర్లు కేటాయించారు. ఇక నుంచి విద్యుత్‌శాఖ అధికారులతో సంప్రదింపులు జరపాలన్నా, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించాలన్నా నూతన నంబర్లలో సంప్రదించాలని ఆ శాఖ అధికారులు కోరుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులకు కేటాయించిన కొత్త ఫోన్ నంబర్లు పరిశీలిస్తే.. డీఈ భద్రాచలం 8712486022, ఏడీఈ చర్ల 8712486052, ఏఈ చర్ల 8712486053, సబ్ ఇంజనీర్ చర్ల 8500414077, సీనియర్ లైన్, ఇన్‌స్పెక్టర్ చర్ల 8712486054, లైన్‌మెన్ చర్ల 8712486057, లైన్ మెన్, సత్యనారాయణపురం 8712486058, లైన్ మెన్ తేగడ 8712486059, స్టేషన్ చర్ల 8712486061, స్టేషన్ సత్యనారాయణపురం 8712486062గా కేటాయించారు.

వాసవీక్లబ్ సేవా కార్యక్రమాలు



మణుగూరుటౌన్: బల్లలను ప్రారంభిస్తున్న క్లబ్ బాధ్యులు

మణుగూరుటౌన్: మణుగూరు వాసవీక్లబ్, వనితా వైభవం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రయాణికుల సిమెంట్ బల్లలు సమకూర్చారు. ఉచిత డయాబెటిస్ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఓ రైతును సన్మానించి చర్మకారుడికి కిట్ వితరణ చేశారు. ఆయా కార్యక్రమాలకు ఇంటర్నేషనల్ కార్పొరేట్ అడ్మినిస్ట్రేటివ్ ప్రెసిడెంట్ బండారు వెంకటేశ్వర్లు, రేపాక రాజమనోహర్, రీజియన్ చైర్‌పర్సన్ మిరియాల శ్రీలతలు హాజరై ప్రారంభించారు. కార్యక్రమాల్లో క్లబ్ బాధ్యులు శ్యామ్, బొగ్గవరపు అంజలి, దోసపాటి స్వర్ణ, బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథగుప్తా, చిట్టూరు శేషుబాబు, దోసపాటి నాగేశ్వరరావు, వనమా లక్ష్మీనారాయణ, దింటకుర్తి బ్రహ్మయ్య, సముద్రాల కృష్ణమూర్తి, చిత్తలూరి రమేశ్‌బాబు, దోసపాటి ధర్మారావు, కొల్లూరి మోహన్‌రావు, సుగ్గల సూర్యం, చిట్టూరు నాగరత్నమణి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమికోన్న పాఠశాల్లోని విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని నల్లబాడు ఏపుగంటి బాపిరాజు గడిచిన 11ఏళ్లుగా ఆర్మీలో సేవలు అందిస్తున్న నేపథ్యంలో అతని తల్లిదండ్రులైన శ్రీనివాసరావు-లక్ష్మీ రాజేశ్వరి దంపతులను క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ ఇంటర్నేషన్ వైస్ ప్రెసిడెంట్ పొట్టి శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మీ, క్లబ్ బాధ్యులు అత్తులూరి పురుషోత్తమరావు, బోగవల్లి రాంబాబు, సత్యవరపు బాలయ్య, కుమార్ రాజా, జల్లిపల్లి దేవరాజ్ పాల్గొన్నారు.

పోడుపట్టాల కోసం ధర్నా



అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పినపాక: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సాగుదారులపై అటవీ శాఖ అధికారుల దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం మండలంలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్ నుంచి అటవీ శాఖ కార్యాలయం వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోడు సాగుదారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన సాగు పోడుదారులకు పట్టాలు మంజూరు చేయాలని, అటవీశాఖ అధికారుల అక్రమ కేసులు, దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు, సబ్ స్టేషన్‌లో ఫీడర్ల అత్యవసర మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం సారపాక-1, సారపాక-2 విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ.. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయితీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి సోమవారం పరిశీలించారు. బేస్‌మెట్ లెవెల్ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించిన ఆమె.. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ వెంట హౌజింగ్ ఏఈ రాము పాల్గొన్నారు.

ఇంటింటా జ్వర సర్వే

కరకగూడెం: మండల పరిధిలోని అనంతారం ఎస్టీ కాలనీలో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. జ్వర పీడితులను పరీక్షించి మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణారావు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఓకు వినతి

ములకలపల్లి: స్థానిక గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. సీపీఐ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం భద్రాచలంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో లిఖితపూర్వక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ మాట్లాడుతూ.. కుమ్మరిపాడు గ్రామ ఆదివాసీలకు పోడు పట్టాలు ఇవ్వాలని, ధర్మన్ననగర్‌లో మంచినీటి వసతి, విత్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. సాయం బాబూరావు, మోకాళ్ల శ్రీను, పాయం రాంబాబు, ఊకే కుమార్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎలకలగూడెం గ్రామానికి చెందిన బూర్కా భద్రయ్య బైక్‌పై అశ్వాపురం వైపు వస్తుండగా.. బీపీసీ పెట్రోల్ బంక్ ఎదుట బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో భద్రయ్యకు గాయాలవగా.. స్థానికులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు.

'మోసం చేస్తున్న కాంగ్రెస్'

చర్ల: తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. సోమవారం చర్లలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుండడాన్ని ఆయన తప్పుబట్టారు. మండల కోకన్వీనర్ పవన్‌కుమార్, నాయకులు అజీజ్, అనీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను సోమవారం అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, మండలంలోని వినాయకపురం, నారాయణపురం గ్రామాలు.. దమ్మపేట, ములకలపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు. మెచ్చాకు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో 'రైతు నేస్తం'



బూర్గంపాడు: రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు



దమ్మపేట: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న నాయకులు, రైతులు

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పలు గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమంలో రైతులు పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సందేశం విన్నారు. అనంతరం సీఎం చేతుల మీదుగా రైతు భరోసా పథకాన్ని ప్రారంభించగా.. తిలకించారు.

బూర్గంపాడు: బూర్గంపాడు, మోరంపల్లిబంజర, తాళ్లగొమ్మూరులలోని రైతు వేదికల్లో సీఎం ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం, అనంతారం, అశ్వారావుపేట రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించగా.. సొసైటీ చైర్మన్లు సీహెచ్ సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏఓ శివరాంప్రసాద్, ఏఈవోలు షాకిరా భాను, నార్లపాటి రవీంద్ర, ఆరేపల్లి సతీష్, రైతులు పాల్గొన్నారు.

దమ్మపేట: అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు రవికుమార్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లారం, పట్వారిగూడెం, నాగుపల్లి రైతు వేదికల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, ఏఓ చంద్రశేఖర రెడ్డి, ఎంపీఓ రామారావు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలంలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల అధికారులు, పలుపార్టీల నాయకులు, రైతులు పాల్గొని వీక్షించారు. ఎంపీడీఓ గద్దె రేవతి, ఐకేపీ ఏపీఎం సంపత్‌కుమార్, ఏఈఓ మనోహర్, జీపీ కార్యదర్శి రవి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఏఓ అనుష, పశువైద్యాధికారి సీహెచ్ బుచ్చిబాబు, ఏఈఓలు ప్రశాంత్, సుజాత, రైతులు పాల్గొన్నారు. చంద్రుగొండలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించగా.. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓలు సాయిభాను, శ్రీనివాసరావు, అరుణ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీలు

హకీంపేట్, కరీంగనర్, ఆదిలాబాద్‌ల్లోని క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు కోరుతోంది. విద్యార్థులకు పలు పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలు తమ వివరాలను tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఆ ప్రింట్‌ను కింద పేర్కొన్న పాఠశాలల్లో నిర్ణయించిన తేదీలోపు అందజేయాల్సి ఉంటుంది. ఆయా తేదీల్లో క్రీడాపోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డ్, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాల్సి ఉంటుంది.

అశ్వాపురం: ఈ నెల 19న మండల పరిధిలోని మిట్టగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాంశాలలో పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ వీరస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో అప్లై చేసిన ప్రింట్‌ను రేపటిలోగా పాఠశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 9959087110ను సంప్రదించాలన్నారు.

బూర్గంపాడు: ఈ నెల 17, 18 తేదీల్లో బూర్గంపాడులోని గవర్నమెంట్ హైస్కూల్‌లో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి యదుసింహరాజు తెలిపారు. సోమవారం ఓ ప్రకటలో 17వ తేదీన బాలికలకు, 18వ తేదీన బాలురకు మండల స్థాయి ఎంపికలుంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9949305743 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మణుగూరురూరల్: ఈ నెల 19న మణుగూరు జెడీ కోఎడ్యుకేషన్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9347604975 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

దమ్మపేట: క్రీడాపోటీలకు సంబంధించి ఎంఈఓ కె.లక్ష్మి.. పీడీలు, పీఈటీలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. పోటీల తీరుతెన్నులపై చర్చించారు. మరిన్ని వివరాలకు ఎమ్మార్సీలో సంప్రదించాలని సూచించారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ఈ నెల 18వ తేదీన ఎర్రగుంట పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 9010335333కు సంప్రదించాల్సిందిగా కోరారు.

దమ్మపేట: క్రీడాపోటీలపై మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులతో ఎంఈఓ కీసర లక్ష్మి సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ నెల 19న దమ్మపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రామనాథం, పవన్‌కుమార్, భద్రయ్య, కృష్ణ, మల్లేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ములకలపల్లి: పల్లీచిక్కీలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ సీత

ములకలపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీఓ సీత సూచించారు. ములకలపల్లి మండలకేంద్రంలోని బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం యుక్తవయసు బాలికలకు పల్లీ చిక్కీలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఆహారంలో సమతుల్యత పాటించడం ద్వారా అనారోగ్యాన్ని అధిగమించవచ్చని అన్నారు. సూపర్‌వైజర్ సామ్రాజ్యం, హెచ్‌ఎం పూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, శివలక్ష్మి, బీబినేని నాంచారి పాల్గొన్నారు.

చంద్రుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సలోని టీచర్లకు సూచించారు. మండల కేంద్రం చంద్రుగొండలో సోమవారం ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సలోని మాట్లాడుతూ.. సిలబస్ ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ అమృత పథకం ద్వార 14 నుండి 18 సంవత్సరాల బాలికలకు రక్తహీనత తగ్గించడానికి, బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనన్నారు. కార్యక్రమంలో అభిమాన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్, డీపీఏ రాము, సూపర్‌వైజర్లు సుజాత, లక్ష్మి, రాణి, మహాలక్ష్మి, టీచర్లు అరుణ, నాగమణి, శకుంతల పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఐసీడీఎస్ మణుగూరు ప్రాజెక్ట్ పరిధిలోని రాజుపేట-1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ సుశీల సారథ్యంలో సోమవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించా ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాలు, అంకెలు వంటి వాటిని నేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు ఎస్.పాపమ్మ, బి.హంకి, లక్ష్మి, ఆయాలు, పిల్లల తల్లులు, ఏఎన్ఎం దితరులు పాల్గొన్నారు.

విస్తరణ పనులతో తిప్పలు



విస్తరణ పనులతో గుంతలమయంగా మారిన భద్రాచలం రోడ్‌లోని ప్రధాన రహదారి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని భద్రాచలం, జంగారెడ్డిగూడెం మార్గాలు, రింగ్‌రోడ్ సెంటర్‌లో గడిచిన పది నెలలుగా సాగుతున్న విస్తరణ పనులతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అవగాహన రాహిత్యం, అస్తవ్యస్తంగా చేస్తున్న పనులతో భద్రాచలం మార్గంలోని శ్రీ పొట్టిశ్రీరాముల సెంటర్, రింగ్ రోడ్ సెంటర్‌లలో ప్రధాన రహదారులపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షంతో ఈ గుంతల్లో వరద నీరు నిలిచి బురదమయంగా మారాయి. అడుగడుగున ఉన్న గుంతలతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు.